క్లుప్తంగా

కోరం లేక సభ వాయిదా

బిజినేపల్లి: మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి తగిన కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ తెలియజేశారు. సమావేశానికి సభ్యులు, ఆయా శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేశామని, సమావేశం తేదీని మరోసారి ప్రకటిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణయ్య తెలియజేశారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్యానికి గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల అనారోగ్యం బారిన పడటంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శ్రీనివాస్‌గౌడ్ మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌కు వినతి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆనందగిరి గుట్టపై గిరిజన గురువు సంతు సేవాలాల్ ఆలయ నిర్మాణం చేపట్టకుండా చూడాలని బిజినేపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతి అందజేశారు. గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి ఆలయ కమిటీ, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ, అయ్యప్ప దేవస్థాన కమిటీ తదితరులు సంతు సేవాలాల్ ఆలయ నిర్మాణం చేయరాదని, ఆయనకు మరో చోట అధికారులు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం సర్పంచ్ బాలీశ్వర్‌కు వినతి అందజేశారు.

మృతుని కుటుంబానికి నాగం పరామర్శ

తాడూరు: మండల కేంద్రానికి చెందిన తాడూరు సర్పంచ్ యాదమ్మ మామ కనుపటి లింగం అనారోగ్యంతో మృతిచెందాడు. అదేవిధంగా మండలంలోని ఐతోల్‌లో చిన్నారెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఐతోల్‌లోని మృతుడు చిన్నారెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి తనయుడు కూచకుల్ల రాజేష్‌రెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన సామ రామచంద్ర అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబానికి రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం కొంత నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. బీసం రాజు, మహేష్, నజీర్, సత్యం పాల్గొన్నారు.

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌కి చెందిన హరీశ్‌యాదవ్ ఇంటి వద్ద విద్యుత్ పనులు చేస్తుండగా.. ప్రమాదానికి గురయ్యాడు. దీంతో సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, గోపాల్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆచారి పరామర్శ....

విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న హరీశ్‌యాదవ్‌ను సోమవారం జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట యాదయ్య తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్ వాస్తవ్యులు రాజుల దేవిరాజు, అనురాధ నిత్యాన్నదానం కోసం రూ.25,116 అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యురాలు నవ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశోక్

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దేశ్యానాయక్ అన్నారు. సోమవారం అచ్చంపేటలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశోక్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, సభ్యులుగా పాండు, లక్పతి, గోవింద్, చంద్రశేఖర్, తిరుపతి, దగ్గానాయక్, రాజగోపాల్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు

- వార్డు పర్యటనలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన 'మీ కోసం– మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా 7, 8 వార్డుల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చాలని సూచించారు. వార్డుల్లో కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ డాక్టర్ రాముడుయాదవ్, కోఆప్షన్ సభ్యులు బండల వెంకటస్వామి, రుక్మద్దీన్ నాయకులు నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, జాఫర్, ఖాదర్‌పాష, పరశురామ్‌గౌడ్, గోపాలమల్లయ్య, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మండలంలోని ఎన్మన్‌బెట్లకి చెందిన పలువురు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి తాము పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. నాయకులు లక్ష్మణ్‌రావు, భాస్కర్‌గౌడ్, ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రజావాణితో సమస్యలు పరిష్కారం



వెల్దండలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన మండల శాఖ అధికారులు



లింగాలలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

వెల్దండ: ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మండల శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రజావాణిని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజావాణిలో అందించిన ఫిర్యాదులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను అధికారులకు అందించారు. మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏఓ మంజుల, ఏఈ తిరుపతినాయక్, పశువైద్య అధికారి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

లింగాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి ఎలాంటి వినతులు అందలేదు. దరకాస్తుల గురించి అధికారులు వేచి చూడక తప్ప లేదు. వచ్చిన అధికారులు సమయం వరకు కూర్చొని వెళ్లి పోయారు. ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, ఏఓ నాగార్జునరెడ్డి, ఐసీడీఓ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, చందు నాయక్ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ అధికారులు

లింగాల: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని డీసీసీబీ ఫీల్డు ఆఫీసర్ మోహన్ రైతులను కోరారు. రుణాల రికవరీపై సోమవారం మండల పరిధిలోని అప్పాయపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫీల్డు ఆఫీసర్ మాట్లాడారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే.. పీఏసీఎస్ ఆర్థికంగా బలపడుతుందని అన్నారు. రుణాలను గడువులోగా చెల్లిస్తే వడ్డీ భారం కూడా తగ్గుతుందన్నారు. అప్పాయపల్లి పరిధిలో దాదాపుగా 80 మంది వరకు రైతులు రుణాలు చెల్లించాల్సి ఉందని అన్నారు. గతంలో పొందిన ఎల్టీ, ఎస్టీ లోన్స్ పూర్తిస్థాయిలో రికవరీ జరిగితే కొత్త రుణాలు ఇచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. రుణాలు తీసుకునే సమయంలో చూపిన శ్రద్ధ, చెల్లించడంలో చూపకపోవడం ఏమిటని ఆయన రైతులను ప్రశ్నించారు. ప్రస్తుతం వివిధ రకాల పంటలు చేతికి అందుతున్న తరుణంలో రుణాలు చెల్లింపులు చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సీఈఓ పాండు, డైరెక్టర్ ఎల్లమ్మ, సిబ్బంది బాలరాజు, మంజుల, రైతులు పాల్గొన్నారు.

హనుమద్విజయం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, ప్రముఖులు

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని గొరిట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రముఖ కవి మహ్మద్ జహంగీర్ సంపాదకత్వంలో పునర్ముద్రించిన హనుమద్విజయం నాటక కావ్యాన్ని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. పుస్తకంలో భక్తి గొప్పదా, శక్తి గొప్పదా అనే ఇతివృత్తాన్ని తెలియజేస్తుందని, ఆంజనేయుడి వీరరసాన్ని పలికించిన శక్తివంతమైన కావ్యమని అన్నారు. కొండికొండ మోహన్, ఎదిరెపల్లి కాశన్న, కపిలవాయి అశోక్‌బాబు, ముచ్చర్ల దినకర్, కృష్ణారెడ్డి, బుచ్చారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

గుండాలలో సత్యనారాయణస్వామి వ్రతాలు



వెల్దండ మండలం గుండాలలో వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వెల్దండ: మండల పరిధిలోని అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది భక్తులు అధిక సంఖ్యలో వ్రతాలను చేస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధికెక్కిన కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారని, మొక్కులు ఉన్నవారు వ్రతాలు చేస్తున్నారని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఆవరణలో జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న రోహిణి, రాజేశ్‌రెడ్డి

తాడూరు: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని తెలంగాణ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేడిపూర్‌లో రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఓపెన్ కబడ్డీ టోర్నీ పేరుతో ప్రతిఏటా ఈ పోటీలు నిర్వహిస్తారు. రెండు రోజుల పాటు సాగిన కబడ్డీ పోటీల్లో మూడో రోజు సోమవారం విజేతలకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు కనుమరుగు కాకుండా మేడిపూర్ యువకులు కబడ్డీ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇక నుంచి ఎలాంటి క్రీడలు నిర్వహించినా.. సమాచారం తనకు అందించినట్లయితే తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. టోర్నీ మొదటి బహుమతి దాత రూ.25 వేల జెడ్పీటీసీ రోహిణి గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. మొదటి బహుమతి కంచిరావుపల్లి, రెండో బహుమతి మిషన్ నాగర్‌కర్నూల్, మూడో బహుమతి పెద్దకొత్తపల్లి జట్లు ఎంపికయ్యాయి. మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, గ్రామస్తులు జంగిరెడ్డి, మాధవులు, వార్డు సభ్యులు ఆయా గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పాపగల్ బండ్ల ఊరేగింపు..

మండలంలోని పాపగల్‌లో శివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. సోమవారం బండ్ల ఊరేగింపులో కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి అనంతరం ఎద్దుల బండిలో మాజీ ఎంపీటీసీ రమేశ్‌తో కలిసి బండ్లపై స్వారీ చేశారు. అనంతరం గ్రామానికి వచ్చిన రాజేశ్‌రెడ్డిని మాజీ సర్పంచ్ నారాయణ, వెంకటయ్య, ప్రతాప్‌రెడ్డి సన్మానించారు.

అచ్చంపేటలో ఫ్లెక్సీల రగడ

అచ్చంపేట రూరల్: అచ్చంపేటలో రాజకీయ సమీకరణాలు రోజు రోజుకు మారుతున్నాయి. ఫ్లెక్సీల రగడ కొనసాగుతూనే ఉంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, అతని తనయుడు భరత్‌ప్రసాద్, అచ్చంపేట బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చించివేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అనుచరులే ఫ్లెక్సీని చించివేసి ఉంటారని ఎంపీ వర్గీయులు అంటున్నారు.

రేపు 'చలో హైదరాబాద్'



మాట్లాడుతున్న చైతన్య

కొల్లాపూర్: పశుమిత్రల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నట్లు పశుమిత్ర సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, మంజుల వెల్లడించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్థక శాఖలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న పశుమిత్రలకు కనీస వేతనాలు కూడా అందడం లేదన్నారు. పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. సమావేశంలో శిరీష, రాధ, దీపిక, వరలక్ష్మి, మంజుల తదితరులున్నారు.

కార్యవర్గం ఏర్పాటు



ఉప్పునుంతల: మండలం ఫొటో, వీడియోగ్రఫీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కోట్ల బీమయ్యయాదవ్‌తో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ఏర్పాటులో జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్‌కుమార్, కార్యదర్శి శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా గోలి శేఖర్

అమ్రాబాద్: ఉమ్మడి మండలం(అమ్రాబాద్, పదర) ఫొటో, వీడియో గ్రాఫర్ మండల అధ్యక్షుడిగా పదరకు చెందిన గోలి శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అమ్రాబాద్: గ్రామాల వరకు విస్తరించి ఉన్న తపాలా కార్యాలయం సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, నాగర్‌కర్నూల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సూచించారు. సోమవారం అమ్రాబాద్ తపాలా కార్యాలయం వద్ద పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తపాలా కార్యాలయాల్లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ డబ్బులు డిపాజిట్ చేస్తే.. అధిక వడ్డీ వస్తుందన్నారు. ఇందుకోసం ప్రతిఒక్కరూ పోస్టాఫీసులో ఖాతాలు తెరవాలని వివరించారు.

గుడిసె దగ్ధం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆలూరు రమేష్‌కు చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. దీంతో ఇంట్లోని నగదుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, మరికొన్ని పత్రాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. తహసీల్దార్ శైలేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, రూ.3,000, హెడ్‌కానిస్టేబుల్ ఎంకోజి, రూ.2,000 బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

పెంట్లవెల్లి: మండల పరిధిలోని కొండూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల రూపురూఖలు మారనున్నాయి. 'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా కొండూరు పాఠశాలలో అన్ని విధాలుగా రూపురేఖలు మారనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వర్క్‌గాని, గ్రీన్‌బోర్డు, పెయింటింగ్, డ్యూయల్ డెస్క్ బెంచీలు ఇతర పనులు పూర్తి చేశారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ

బల్మూర్: గ్రామాల్లోని ప్రజాసమస్యలపై మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేయాలని ఎంపీడీఓకు సూచించారు. సోమవారం ఎంపీపీ వేనేపల్లి అరుణ అధ్యక్షతన బల్మూర్ మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో అస్తవ్యస్తంగా ఉన్న వైర్లు, స్తంభాలను సరిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీపీతో పాటు సభ్యులు మండిపడ్డారు. వచ్చే మండల సమావేశంలోగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించకుంటే అధికారులపై కలెక్టర్ ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీఓ దేవన్న, నర్సయ్య యాదవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి ప్రత్యేక చర్యలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మల

చారకొండ: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తాగునీటిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో రైతువేదికలో సోమవారం ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల అధికారులు, గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు శాఖల వారీగా అభివృద్ధి, పెండింగ్ పనులపై సభలో తెలిపారు. ఆయ గ్రామాల సర్పంచ్‌లు ఉపాధి పనుల బిల్లులు, తాగునీటి సరఫరాపై సభలో వివరించారు. సంబంధిత అధికారులు స్పందిస్తూ.. తక్షణమే సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీపీ నిర్మల మాట్లాడారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులను కోరారు. ఎంపీడీఓ జయసుధ, తహసీల్దార్ నాగమణి, వైస్ ఎంపీపీ బక్కమ్మ యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్యగౌడ్, రైతుబంధు అధ్యక్షుడు యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు మేలు



వెల్దండ మండలం చెర్కూర్‌లో హాథ్‌సేహాథ్ యాత్రను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించామని, దీంతో పేదలకు ఎంతో మేలు జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చెర్కూర్‌లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట తిరుగుతూ ప్రజలకు వివరించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శేఖర్, పుల్లయ్య, నాగమణి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

తాడూరు: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నిరంజన్, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్య ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ పాలన విసిగి వేసారిన ప్రజలకు తాము అండగా ఉన్నామంటూ రాహుల్‌గాంధీ చరిత్రలో ఎవరూ చేయని విధంగా 4,600 కిలోమీటర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు దేశ ప్రజలను మమేకం చేసేందుకు భారత్ జోడో యాత్రను ప్రారంభించాడన్నారు. రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభించారన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు తాము అండగా ఉన్నామంటూ ఊరూరా కార్యక్రమాలు చేపట్టామన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోపిడీ చేసిందన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పారిశ్రామికవేత్తలకు దోచి పెడుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లయ్యగౌడ్, లక్ష్మయ్య, జెడ్పీటీసీ రోహిని, మాధవి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, పాండు, అర్థం రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా స్థలాన్ని తొలగించాలని ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న ఇందిరానగర్ కాలనీవాసులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఓ ప్రార్థనా మందిరం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఇందిరానగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ హస్రిత్ కుమార్, ఎస్ఐ రమేశ్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కొన్ని సంవత్సరాల కిందట ఇందిరానగర్ కాలనీ రోడ్ నంబర్ 4లో సొసైటీ పేరుమీద ఖాళీ స్థలం కొనుగోలు చేసి, ఇంటి పర్మిషన్ తీసుకున్నారని కాలనీ వాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి రోజు ఆ స్థలంలో గుంపులు గుంపులుగా ఒక వర్గానికి చెందిన యువకులు కూర్చోవడంతో పాటు అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. మున్సిపల్ చట్టాల ప్రకారం నివాసాల మధ్య ఎలాంటి ప్రార్థనా మందిరాలు నిర్వహించడానికి అనుమతి లేదని వెంటనే ప్రార్థనా స్థలంపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు బాబిదేవ్, రాజుగౌడ్, అనిల్ గౌడ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు డిమాండ్ చేశారు.

బిల్లులు చెల్లించాలని సమావేశం బహిష్కరణ

బల్మూర్: గ్రామపంచాయతీల్లో అప్పులతో చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు అందక అవస్థలు పడుతున్నామని నిరసిస్తూ.. సోమవారం మండలంలోని సర్పంచ్‌లు మండల సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు 10 నెలల నుంచి రాకపోవడంతో వర్కర్లకు జీతాలు చెల్లించని స్థితిలో నిర్వహణ భారమవుతుందని విచారం వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులతో పాటు, చేసిన పనులకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రేవతి, పుష్పమ్మ, మయూరి, అంజనమ్మ, శ్రీనివాసులు, దేశ్యానాయక్, చిన్నారెడ్డి, శ్రీరాంనాయక్, నాగరాజ్, జ్యోతి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని రైతు వేదికలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కరుణశ్రీ తెలియజేశారు. సమావేశానికి ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.



మండల సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

తెలకపల్లి: కంటి వెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి వెలుగు పరీక్షలు ప్రతిఒక్కరూ చేయించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశాకార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రమేశ్, సురేశ్, భాస్కర్ గౌడ్, భీంపాల్ పాల్గొన్నారు.

కల్వకుర్తి: కంటి వెలుగు కార్యక్రమం పట్టణంలో కొనసాగుతుంది. సోమవారం విద్యానగర్ కాలనీలో వార్డు కౌన్సిలర్ మంజుల కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడారు. ప్రతిఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తం 701 మంది కంటి పరీక్షలు చేయించుకోగా.. 57 మందికి కంటి అద్దాలను అందించారు.

'రాష్ట్రంలో అధికారమే ధ్యేయం'

మన్ననూర్: రాష్ట్రంలో బీజేపీ అధికారమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు మండికారి బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం మన్ననూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు గోలి రాజు అధ్యక్షతన సహ కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో పార్టీని ఉద్దేశించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారం ఖాయమని అన్నారు. అందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాగోసలో ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. బీజేపీ భరోసా పేరుతో శక్తి కేంద్రంగా కార్నర్ సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం పథకాలను వివరిస్తూ నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచాలన్నారు.